శ్మశానంలో నీటికి కష్టం

- దహన సంస్కారాలకు వెళ్లే వారికి అవస్థలు
- ట్యాంకర్ నీటిని కొనుక్కోవాల్సిన దుస్థితి
- పట్టించుకోని జీహెచ్‌ఎంసీ అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు

రామంతాపూర్: ఎవరైనా చనిపోతే శ్మశానానికి వెళ్లి దహన సంస్కారాలు పూర్తయిన తర్వాత అందరూ అక్కడే స్నానాలు చేసి ఇళ్లకు వెళ్తారు. అందుకు శ్మశాన వాటికల్లో తప్పని సరిగా నీటి సౌకర్యం ఉండేలా చూస్తారు. అయితే రామంతాపూర్‌లోని రాజేంద్రనగర్, నేతాజీనగర్‌లో ఉన్న రెండు హిందూ శ్మశాన వాటికల్లో నీటికి ఇక్కట్లు తప్పవు. ఎవరైనా చనిపోతే ముందుగానే ట్యాంకర్లతో నీటిని తెప్పించుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. పలుమార్లు ట్యాంకర్లు కొనుగోలు చేస్తున్నా.. వారు సమయానికి రాకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. ట్యాంకర్‌తో అక్కడ ఉన్న డ్రమ్ముల్లో పోసేసి వెళ్తున్నారు. వాష్‌రూమ్‌లలో నీరు లేకపోవడంతో అపరిశుభ్రంగా మారి కంపుకొడుతున్నాయి. బోరు పంపు మోటార్లు చెడిపోయి వారం, పది రోజులు గడుస్తున్నా జీహెచ్‌ఎంసీ అధికారులు మరమ్మతులు చేయించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.





నాచారం పీఅండ్‌టీ కాలనీలో జగదీశ్వర్ ఇంట్లో దగ్ధమైన వస్తువులు

హైఓల్టేజీతో గృహోపకరణాలు దగ్ధం

మల్లాపూర్: విద్యుత్ హై ఓల్టేజీతో నాచారం డివిజన్ పరిధిలోని పీఅండ్‌టీ కాలనీలో ఉదయం 7 గంటల ప్రాంతంలో విద్యుత్ హైఓల్టేజీ కారణంగా పలు ఇళ్లలో గృహోకరణాలు దగ్ధమయ్యాయి. విశ్రాంత ఉద్యోగి జగదీశ్వర్ ఇంట్లో ఫ్రిజ్, టీవీ, ఫ్యాన్లు, ఏసీలు కాలి బూడిదయ్యాయి. ఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆరిపేశారు. దాదాపు మరో 10 ఇళ్లలో విద్యుత్ మీటర్లు, బోర్ మీటర్లు, టీవీలు, ఫ్యాన్లు ఖాళీ పోయాయి. ఘటన స్థలానికి చేరుకున్న డీఆర్‌ఎఫ్, ఫైర్ అధికారులు, పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా హోలీ సంబురాలు

బోడుప్పల్: బోడుప్పల్ బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాలలో సోమవారం హోలీ సంబురాలను ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ గంగరాజు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎలాంటి కెమికల్స్ లేకుండా హోలీ పండగను జరుపుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రంగులు చల్లుకొని ఉత్సాహంగా గడిపారు.

హలో కిడ్స్ ప్లే స్కూల్ ప్రథమ వార్షికోత్సవం

మౌలాలి: సాయినాథపురంలోని హలో కిడ్స్ ప్లే స్కూల్ వార్షికోత్సవాన్ని మౌలాలిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి కార్పొరేటర్ గున్నాల సునీతశేఖర్‌యాదవ్ హాజరై వేడుకలను ప్రారంభించారు. స్కూల్ చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

విద్యార్థులకు అన్నదానం

మల్లాపూర్: న్యూలైఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు నసీమా భాను ఆధ్వర్యంలో నాచారం వెస్లీ పాఠశాలల్లో 250 మందికి విద్యార్థులకు అన్నదానం చేశారు. అనంతరం నసీమా భాను మాట్లాడుతూ.. సేవ లక్ష్యంగా న్యూ ఫౌండేషన్ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో వేర్పుల మహేష్, న్యూలైఫ్ ఫౌండేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన





హోలీ వేడుకలో జేజీఆర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

ఆర్థిక సాయం

అల్వాల్: ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన టి.భాస్కర్ కుటుంబానికి తోటి వీబీఆర్ రియల్ ఎస్టేట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో అతడి భార్య భారతికి రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. అసోషియేషన్ సభ్యులు సాయిబాబా, సంతోష్‌కుమార్, నవీన్‌రెడ్డి, సత్యనారాయణ ఉన్నారు.

శెభాష్.. టీమ్‌వర్క్

కుషాయిగూడ: రాజ్‌భవన్‌లో సోమవారం జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో గవర్నర్ చేతులమీదుగా కుషాయిగూడకు చెందిన పలువురు మహిళలు అవార్డులు అందుకున్నారు. సున్నం వేసే బాలయ్య వద్ద సున్నాలు వేసేందుకు పనిలో చేరిన కొంతమంది మహిళలు ఓ గ్రూపుగా ఏర్పడి స్వయంగా సున్నాలు వేసే కాంట్రాక్టులు చేయడం మొదలు పెట్టారు. 30 ఏళ్లుగా ఐక్యంగా ముందుకు సాగుతున్నారు. ఈ సందర్భంగా కాలెమ్మ టీం సభ్యులను గవర్నర్ అభినందించి ప్రశంస పత్రాన్ని అందజేశారు.



‘మధ్యాహ్న భోజనం బాగుంది’



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న బండారు లక్ష్మారెడ్డి

రామంతాపూర్: రామంతాపూర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర సీనియర్ నేత బండారు లక్ష్మారెడ్డి విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పాఠశాలలో మధ్యాహ్న భోజనం బాగుందని, ప్రతి విద్యార్థికి ప్రభుత్వం అందజేస్తున్న మెనూలోని అన్ని పదార్థాలను వండి వడ్డించాలని సూచించారు. నాడు-నేడు పేరిట ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తోందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలలో నెలకొన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తేవాలని అన్నారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం సాంబయ్య, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు అనసూయమ్మ, బీఆర్‌ఎస్ నేతలు శ్రీకాంత్‌గౌడ్, శంకర్, నరేష్, పవన్, చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లిలో గజం రూ.63 వేలు

సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మేడిపల్లిలో హెచ్‌ఎండీఏ స్థలాలకు సోమవారం నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో అనూహ్య స్పందన లభించింది. చదరపు గజానికి అప్‌సెట్ ధర రూ.32 వేలుగా నిర్ణయించగా అత్యధికంగా గజానికి రూ.63 వేల వరకు డిమాండ్ రావడం గమనార్హం. ఎక్కువ శాతం గజానికి రూ.58,730 చొప్పున అమ్ముడయ్యాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో మొత్తం ప్లాట్‌లలోని 15,000 చదరపు గజాల స్థలాన్ని విక్రయించారు. రూ.48 కోట్ల వరకు ఆదాయం రావొచ్చని అంచనా వేయగా అనూహ్యంగా రూ.88.1 కోట్ల ఆదాయం వచ్చినట్లు హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపారు.

సీఎం రిలీఫ్ పేదలకు వరం

బోడుప్పల్: సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు వరమని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్ 15వ డివిజన్ పరిధిలోని శ్రీఎస్వై నగర్ కాలనీకి చెందిన సుధాకర్‌రెడ్డి అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరారు. వారికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ రూ 2.50 లక్షల(ఎల్‌ఓసీ) పత్రాలను ఆయన వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేద, మధ్య తరగతి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. 23వ డివిజన్ కార్పొరేటర్ రాసాల వెంకటేశ్ యాదవ్, పడతం లోకేష్ ఉన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి



సీఎం రిలీఫ్ చెక్కును అందజేస్తున్న మంత్రి తలసాని

పేదల ఆరోగ్య రక్షణే.. ప్రభుత్వ లక్ష్యం

హబ్సిగూడ: పేదల ఆరోగ్య రక్షణే ప్రభుత్వ లక్ష్యమని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సోమవారం ఆయన అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, ముత్యంరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నర్సింగ్‌రావు, కృష్ణ, శివ, వంశీ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

లక్ష్మీనగర్ కాలనీ అధ్యక్షుడిగా సుంకు శ్రీనివాస్




లక్ష్మీనగర్ కాలనీ నూతన కార్యవర్గం

మౌలాలి: మౌలాలి డివిజన్ లక్ష్మీనగర్ కాలనీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుంకు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా నర్సింగరావు, కోశాధికారిగా గోవర్ధన్‌గుప్తా ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని కాలనీవాసులు శాలువాతో సత్కరించారు.

ప్రజావాణి దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలి

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రజావాణి దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు ఏ మాత్రం పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టరేట్ ఏఓ వెంకటేశ్వర్లు, లా ఆఫీసర్ చంద్రావతితో కలిసి ప్రజావాణికి వచ్చిన 107 ఫిర్యాదులను ఆయన స్వీకరించారు.

గుమ్మడిదల వెంకటేష్ సస్పెన్షన్



మాట్లాడుతున్న మహేష్ తదితరులు

మేడ్చల్: మండలంలోని రాజబొల్లారం గ్రామ బీఆర్‌ఎస్ యూత్ కమిటీ ఉపాధ్యక్షుడు గుమ్మడిదల వెంకటేష్‌ను ఆ పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు గ్రామ కమిటీ అధ్యక్షుడు మహేష్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి సుదర్శన్ తెలిపారు. గ్రామ బీఆర్‌ఎస్ కమిటీ సమావేశం నిర్వహించి వెంకటేష్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. వెంకటేష్ పార్టీలో ఉంటూ పార్టీ వ్యతిరేఖ కార్యకలాపాలకు పాల్పడుతున్నాడని చెప్పారు. సమావేశంలో గ్రామ ఉపసర్పంచ్ నారాయణగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

గృహిణి ఆత్మహత్య

అల్వాల్: కుటుంబ సమస్యలతో గృహిణి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వెంకటాపురం కొత్తబస్తీలో నివాసముండే టి.సంధ్య(40) ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తూ ఇటీవలే ఉద్యోగం కోల్పోయింది. దానికి తోడు కుటుంబ సమస్యలు తోడయ్యాయి. సోమవారం భర్త డ్యూటీకి కొడుకు కళాశాలకు వెళ్లడంతో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వం వెంటనే స్పందించాలి

బోడుప్పల్: రాష్ట్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు బాధితుల సమస్యను పరిష్కరించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో 17వ డివిజన్ మారుతీనగర్ హనుమాన్ దేవాలయం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 9వ రోజు చేరాయి. ఈ సందర్భంగా కార్పొరేటర్ కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్ మాట్లాడుతూ వందలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయని, వారి సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీక్షలో నర్మద, శ్రీవాణి, సులోచన, విజయలక్ష్మి, గౌరి, సరిత, స్వప్న తదితరులు ఉన్నారు.



ప్రతివీధిలో సీసీ రోడ్డు వేయిస్తా

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని ప్రతి వీధిలో సీసీ రోడ్డు వేయిస్తానని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ అన్నారు. నాచారం ఇందిరా నగర్‌లో రూ.25 లక్షలతో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డు పనులను సోమవారం ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో డివిజన్‌ను అభివృద్ధి చేయడమే తన ధ్యేయమన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రేటర్ నేత సాయిజెన్‌శేఖర్, డివిజన్ అధ్యక్షులు మేకల ముత్యంరెడ్డి, నాయకులు విఠల్ యాదవ్, చంద్రశేఖర్, శ్రీధర్, అజ్మీర్ బేగం, కట్ట బుచ్చన్న గౌడ్, రఫీక్, అలీమ్ చారి, షకీల్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్

ఎన్‌జీఆర్‌ఐలో యువ శాస్త్రవేత్తలకు శిక్షణ



ఎన్‌జీఆర్‌ఐలో సీనియర్ సైంటిస్టులు శ్రీనివాస్‌శర్మ తదితరులు

ఉప్పల్: దేశాభివృద్ధిలో మానవ వనరుల అభివృద్ధి ఆవశ్యకతపై యువ పరిశోధకులు అవగాహన కలిగి ఉండాలని ముంబై బీఏఆర్‌సీ శాస్త్రవేత్త డా.రాజేష్ వత్స అభిప్రాయపడ్డారు. ఉప్పల్ ఎన్‌జీఆర్‌ఐలో నిర్వహించిన ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ శిక్షణ కార్యక్రమం 15వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఖనిజాన్వేషణ, భూమి ప్రక్రియలు, పర్యావరణ అధ్యయనాలకు సంబంధించి ఎర్త్ సిస్టం సైన్సెస్ పరిశోధనలు యువ పరిశోధకుల్లో నైపుణ్యం మెరుగు పర్చుకునేందుకు శిక్షణ ఉపయోగ పడుతుందని అన్నారు. ఎన్‌జీఆర్‌ఐ డైరెక్టర్ ప్రకాశ్‌కుమార్, సీనియర్ సైంటిస్ట్ డా.శ్రీనివాస్‌శర్మ, డా.అభయ్‌రామ్ బన్సల్ పాల్గొన్నారు.

బీజేపీ ఉపాధ్యక్షుడిగా శివయాదవ్

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ బీజేపీ ఉపాధ్యక్షుడిగా హేమానగర్‌కు చెందిన మాడుగుల శివయాదవ్ నియమితులయ్యారు. ఈమేరకు సోమవారం బీజేపీ రాష్ట్ర నాయకులు కొంపల్లి మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.



సమస్యలన్నీ పరిష్కరిస్తా

అల్వాల్: అల్వాల్ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నానని స్థానిక కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని అల్వాల్, రాంనగర్ తదితర ప్రాంతాల్లో సోమవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలు, పారిశుధ్య నిర్వాహణ, కొత్త సీవరేజ్ లైన్ వేయడంతో పాటు సీఅండ్‌డీ వ్యర్థాలను ఎత్తివేయడం వంటి సమస్యలు గుర్తించారు. వెంటనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కవిత, అరవింద్, సత్యనారాయణ, సాయిబాబా, గంగ తదితరులు పాల్గొన్నారు.



అల్వాల్ రాంనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి

సమస్యల పరిష్కారంలో బీఆర్‌ఎస్ విఫలం



యాప్రాల్‌లో సమస్యలు తెలుసుకుంటున్న డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్

అల్వాల్: హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా మల్కాజిగిరి ఏ బ్లాక్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం యాప్రాల్ జేజేనగర్, ఇందిరమ్మ నగర్, కందిగూడ తదితర ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కాలనీల్లోని సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించడంలో బీఆర్‌ఎస్ పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, నర్సింహ, చిత్ర రాజలింగం, నిమ్మ అశోక్ రెడ్డి, జోలి రమేష్, పాండు, ప్రేమ్‌కుమార్, వెంకటేష్ యాదవ్, జీడీ. శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల నిర్వహణపై అవగాహన ఒప్పందం



మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయంలో మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిషనర్ రామకృష్ణారావు, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సీఈఓ రేఖశ్రీనివాసన్‌తో నగర పరిధిలో స్థిరమైన వ్యర్థాల నిర్వహణ కోసం సోమవారం అవగాహన ఒప్పందం(ఎంఓయూ)పై సంతకాలు చేశారు. ఇందులో భాగంగా తడి, పొడి చెత్తను వేరే చేయడం, యంత్రాల సేకరణ, కంపోస్ట్ కోసం షెడ్ల నిర్మాణం, ఇతర పారిశుధ్య కార్యకలాపాల నిమిత్తం శిక్షణ అందించేందుకు సంస్థతో అంగీకారం కుదుర్చుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సుభాష్ నాయక్, హరిశంకర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, అమర్ సింగ్, తూముకుంట్ల ప్రసన్న లక్ష్మి, కుర్ర శాలిని, సరిత, రఘుపతిరెడ్డి, మేనేజర్ జ్యోతిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జానకి, అరుణ, వినీల్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

కాన్షీరాంకు భారత రత్న ఇవ్వాలి



అంబేద్కర్, కాన్షీరాం చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న స్వర్ణకౌర్

మల్లాపూర్: బహుజన సాహిత్య అకాడమీ(బీఎస్‌ఏ) జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ ఆధ్వర్యంలో నాచారంలోని జాతీయ కార్యాలయంలో కాన్షీరాం సోదరి, కాన్షీరాం ఫౌండేషన్ ఛైరపర్సన్ స్వర్ణకౌర్ బీఎస్‌ఏ నేతలతో సమావేశం నిర్వహించారు. కాన్షీరాం ఆలోచనా విధానాన్ని బతికించాలని, భారత రత్న ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. రవీందర్‌సింగ్, ట్రస్ట్ సభ్యులు అడ్వకేట్ లాఖ్బీర్ సింగ్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కుషాయిగూడ: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందగా ఓ వృద్ధుడు గాయపడ్డాడు. అతివేగంతో బైక్‌పై దూసుకువచ్చిన ఓ యువకుడు రోడ్డు దాటుతున్న వృద్ధ దంపతులను ఢీ కొట్టాడు. ఈ ఘటనలో వృద్ధుడు గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా బైక్‌తో ఢీ కొట్టిన యువకుడు చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందాడు. ఈ ఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సాయికుమార్ వివరాల ప్రకారం.. చర్లపల్లికి చెందిన గస్నీ శ్రీనివాసులు, ఆయన భార్య శ్రీదేవి ఆంధ్రప్రదేశ్‌లో ఉంటున్న అత్త సావిత్రమ్మను చూసేందుకు ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో ఇంటి నుంచి బయలుదేరారు. ఈ క్రమంలో ఈసీనగర్ మజీద్ వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో బైక్‌పై దూసుకువచ్చిన అరుణ్‌కుమార్ అదుపు తప్పి వారిని ఢీకొట్టాడు. శ్రీనివాసులు(61)తో పాటు బైక్ నడుపుతున్న అరుణ్ తీవ్ర గాయాలపాలయ్యారు. వారిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్న అరుణ్ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతుడు ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడని, ఇంకా వివాహం కాలేదని ఆయన అన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కుషాయిగూడ: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకెళ్తే.. 50ఏళ్ల వయసు కలిగిన ఓ అనాథ వ్యక్తి గతనెల 13వ తేదీన సైనిక్‌పురి, నిర్మల్‌నగర్ బస్టాప్ వద్ద అనారోగ్యంతో బాధపడుతూ అక్కడే ఉన్నాడు. నిర్మల్‌నగర్‌కు చెందిన జయపాల్ ధర్మపాల్ తన స్నేహితులతో కలిసి వెళ్తుండగా తాను అనారోగ్యంతో బాధపడుతున్నానని, గాంధీ ఆస్పత్రిలో చేర్పించండని వారిని వేడుకున్నాడు. బంధువులు ఎవరూ లేరా అని అడగ్గా ఎవరూ లేరని ఆ వ్యక్తి చెప్పాడు. వెంటనే 108కు సమాచారం అందజేసి గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న అతడు శనివారం మృతి చెందినట్లు గాంధీ ఆస్పత్రి సిబ్బంది ధర్మపాల్‌కు సమాచారం అందించారు. దీంతో అతడు ఈ విషయాన్ని కుషాయిగూడ పోలీసులకు తెలిపాడు. మృతి చెందిన వ్యక్తి వద్ద లభ్యమైన ఆధారాల ప్రకారం సైనిక్‌పురికి చెందిన ధీరావత్ బీక్యాగా గుర్తించామని, ప్రస్తుతం మృతదేహం గాంధీ మార్చురీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. తెలిసిన వ్యక్తులు ఎవరైనా ఉంటే కుషాయిగూడ పోలీసులను సంప్రదించాలని ఎస్‌ఐ ఉపేందర్‌యాదవ్ కోరారు.



నవభారత్ హౌసింగ్ కాలనీ నూతన కమిటీ

మౌలాలి: నవభారత్ హౌసింగ్ కాలనీ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించగా అధ్యక్షుడిగా జీఆర్.విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా బి.ఎల్లయ్య, కోశాధికారిగా ప్రతాప్ ఎన్నికయ్యారు. వారు మాట్లాడుతూ.. అందరి సహకారంతో కాలనీ అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తామన్నారు.

